

ప్రశాంతంగా ఎపిపిఎస్‌సి పరీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రాతపరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల నోడల్ అధికారి, డిఆర్‌ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకూ జరిగిన ఈ రాత పరీక్షకు కాకినాడ జిల్లాలో 1,120 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 787 మంది హాజరయ్యారని, 333 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. పరీక్షకు 72.32 శాతం మంది హాజరయ్యారని తెలిపారు. సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్, ప్రగతి ఇంజినీరింగ్ కాలేజ్, కాకినాడలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్షలు నిర్వహించామన్నారు.

బీచ్‌లో కొరవడిన భద్రత.?

- భయాందోళనలో పర్యాటకులు
- యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు
- పట్టించుకోని పోలీసులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ తీర ప్రాంతంలో పర్యాటకులకు భద్రత కరువయ్యింది. ఆహ్లాదం, ఆటవిడుపు కోసం వస్తున్న తమకు వేధింపులు అధికమయ్యాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాసింత సేద తీరేందుకు సముద్ర తీరానికి రావాలంటేనే జనం భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు రాత్రిళ్ల అసాంఘిక కార్యకలాపాలు కూడా ఎక్కువయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. నాలుగు నెలల క్రితం ఇద్దరు భార్యాభర్తలు కాకినాడ నుంచి ఉప్పాడకు బీచ్ రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు వారిని ఆపి కొంత నగదు దోచుకుని పరారయ్యారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులకు కూడా పిర్యాదు అందలేదు. రాత్రి 9 గంటలు దాటిన తర్వాత ఈ ఘటన జరగడంతో భార్యాభర్తలు తీవ్ర భయబ్రాంతులకు గురయ్యారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా సరైన చర్యలు తీసుకోలేక పోతున్నారనే విమర్శలు పోలీసులపై వినిపిస్తున్నాయి.

జిల్లాలో తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవు తదితర మండలాల్లో 80 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఆయా మండలాల్లో ఉన్న అన్ని బీచ్‌లకూ రోజూ వేలాది మంది పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా వేసవి కావడంతో కాకినాడ ఎన్‌టిఆర్ బీచ్, ఉప్పాడ ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి ఎక్కువయ్యింది. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో అత్యధిక సంఖ్యలో ప్రజలు బీచ్‌లో గడుపుతున్నారు. మిట్ట మధ్యాహ్నం నుంచి మొదలుకుని సాయంత్రం వరకూ అక్కడే ఆట విడుపు సాగిస్తున్నారు. ఇక ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో ఇసకేస్తే రాలనంత మంది పర్యాటకులు బీచ్ అందాలను తిలకిస్తున్నారు. సముద్రపు స్నానాలు చేస్తూ ఎండలకు సేద తీరుతున్నారు.

నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం

కాకినాడ ఎన్టీఆర్ బీచ్ వద్ద పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసి నిరంతరం నిఘా చేస్తున్నాం. అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పర్యాటకుల భద్రతను దృష్ట్యా వారిని ఎప్పటికప్పుడు జాగ్రత్తలు సూచిస్తున్నాం. సముద్రంలో దిగి స్నానాలు చేసే వారి కోసం హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేసాం.

- ఎం.శ్రీనివాస్, కాకినాడ రూరల్ సిఐ.

కొరవడిన పర్యవేక్షణ

తీర ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణ, పోలీసుల గస్తీ లేకపోవడంతో ఆకతాయిల పిచ్చి చేష్టలకు అడ్డు లేకుండా పోతోందని పలువురు పర్యాటకులు వాపోతున్నారు. పర్యవేక్షణ కొరవడిందని వారు ఆరోపిస్తున్నారు. ఉప్పాడ- కాకినాడ తీరం నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉంటోంది. ఎన్‌టిఆర్ బీచ్, లైట్ హౌస్ సమీపంలో పర్యాటకులతో సాగర తీరం కిక్కిరిసిపోతోంది. కుటుంబ సభ్యులు, కొత్తగా వివాహమైన వారు, ఉప్పాడ, కాకినాడ సాగర సోయగాలు వీక్షించేందుకు అధిక సంఖ్యలో వస్తుంటారు. సాయంత్రం వేళల్లో పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. చీకటి పడే సమయానికి ఆకతాయిలు మద్యం తాగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రి 9 దాటితే బీచ్ రోడ్డు గుండా ప్రయాణించాలంటే వాహన చోదకులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు మద్యం, గంజాయి సేవించి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. సెల్ఫీ సరదాలతో కొందరు యువకులు సముద్రం లోతుకి వెళ్లి ఫోటోలు దిగేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదాలకు గురవ్వుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే సాగర తీరంలో భద్రత కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తూతుమంత్రంగా మాత్రమే చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని సమయాల్లో మాత్రం ఆపరేషన్ ఆమ్మ అంటూ ఒకటి, రెండు రోజులు మాత్రం తీరంలో గస్తీ కాసి అపరిచితులు ఎవరినైనా గుర్తిస్తే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు. కనీసం భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం వల్ల ఆకతాయిల పిచ్చి చేష్టలే కాక తీరంలో అధిక సంఖ్యలో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయి. మందు బాబులు నిత్యం బీచ్‌లో మద్యం సేవించడం పరిపాటిగా మారిపోయింది. మారోవైపు వ్యభిచారం చేసే వారు సైతం బీచ్‌లను అడ్డాగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అడపా, దడపా పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కానీ నిరంతర పర్యవేక్షణ మాత్రం ఉండడం లేదని పర్యటకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జిల్లాలో తీర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన


స్ట్రాంగ్ రూములను పరిశీలించిన్న కలెక్టర్ నివాస్

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జెఎన్‌టియుకెలో భద్రపరిచిన ఇవిఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థను శనివారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంల స్ట్రాంగ్ రూములను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లాగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియులో ఇవిఎంలను స్ట్రాంగ్ రూముల్లో సురక్షితంగా భద్రపరిచామన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థను పరిశీలించేందుకు రెండు మూడు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లను తీసుకువెళతామన్నారు. స్ట్రాంగ్ రూముల పరిశీలను వచ్చే వారి వివరాలు తప్పనిసరిగా లాగ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-కాకినాడ

పైప్ లైన్ మరమ్మతుల కారణంగా నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. శనివారం అయన దుమ్ములపేట, సంజయ్ నగర్, డైరీ ఫారం ప్రాంతాల్లో ఎస్ఇ సత్య కుమారి, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్న నేపథ్యంలో స్వయంగా ప్రజలతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వెళ్లే ముడినీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీలను అరికట్టేందుకు మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా ఒకటో డివిజన్ నుంచి 13 డివిజన్ వరకు ఈనెల 23వ తేదీ నుంచి నీటి సరఫరా నిలుపుదల చేశామన్నారు. మంచినీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా నగరపాలక సంస్థ మంచినీటి ట్యాంకర్లతో పాటు, ప్రైవేట్ ట్యాంకర్లను కూడా రప్పించి ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా నీరు అందిస్తున్నామన్నారు. ఈ క్రమంలో శనివారం దాదాపు 14 ట్యాంకర్ల ద్వారా సుమారు 80కి పైగా ట్రిప్పులు వేసి నీటి సమస్య తీర్చామన్నారు. అయినప్పటికీ ఎక్కడైనా నీరు అందకపోయినా, ఇబ్బందులు ఉన్నా తక్షణమే తమ దృష్టికి తీసుకు వస్తే ట్యాంకర్లను పంపించి పరిష్కరిస్తామన్నారు. అత్యవసర మరమ్మతుల దష్ట్యా ఏర్పడ్డ ఈ అవాంతరానికి ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. నీటి సమస్య ఉంటే మొబైల్ నెంబర్లు 9849906507, 9959799138, 9676770461, 9848471415లో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలి


రిజిస్టర్లను పరిశీలిస్తున్న డిఇఒ రమేష్

ప్రజాశక్తి - జగ్గంపేట

5 సంవత్సరాలు పైబడిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ అయ్యే విధంగా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని డిఇఒ పి.రమేష్ ఆదేశించారు. 10వ తరగతి సప్లమెంటరీ పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యాశాఖ మండల పాయింట్‌కు చేరుకున్న విద్యాకానుక పుస్తకాలను, రిజిస్టర్లను పరిశీలించారు. డిఇఒ మాట్లాడుతూ వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో ఎసిఆర్ఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మెటీరియల్స్ పాడవకుండా సూచుకోవాలని, పాఠశాలలు ప్రారంభించే సమయానికి నాడు-నేడు పనుల మెటీరియల్స్ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సూచుకోవాలని సూచించారు. స్కూల్స్ ప్రారంభానికి ముందుగానే హెచ్ఎంలు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి పిల్లలు పాఠశాలల్లో అత్యధికంగా చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఆర్.స్వామి, ఎ.సుబ్రమణేశ్వరరావు పాల్గొన్నారు.


వేసవి శిబిరంలో నృత్యాలపై శిక్షణ


డాన్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శనివారం ప్రజానాట్యమండలి కళాకారులు పలు రకాల నృత్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు కూనిరెడ్డి రవి, అమృత, దారపురెడ్డి కృష్ణ, మహాపాతిన రాంబాబు విద్యార్థులకు నృత్యాలపై శిక్షణ ఇచ్చారు. దుంగల పూజిత, నిఖిల కరాటేలో, నీలపాల కృష్ణ కర్ర సాములో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు పాటలు పాడటం, కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు బొగ్గవరపు నరసింహమూర్తి స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, మంజుల, మణికంఠ, పవన్, సాయిరాం, సత్య కృష్ణ, నేహా, రేణుక అందించారు.

కార్టూ'నిజం'



వ్యాయామంతో రోగాలు దూరం



మాట్లాడుతున్న డాక్టర్ సూర్యారావు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రోజూ క్రమబద్ధంగా శారీరక వ్యాయామం చేయడం వల్ల అనారోగ్యాల నుంచి రక్షణ పొందుతారని ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ బొండా సూర్యారావు పేర్కొన్నారు. రమణయ్య పేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆధునిక జీవనశైలి కారణంగా పలువురు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. జంక్‌ఫుడ్, శారీరక వ్యాయామం లోపం దీనికి ప్రధాన కారణమన్నారు. దీన్ని అధిగమించడం కోసం క్రమం తప్పక నడక, సైకిల్, ఈత, యోగా, వ్యాయామం చేయాలన్నారు. వృద్ధులు వాకింగ్ చేయడం మేలని సూర్యారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 40 మంది గైర్హాజరు

ప్రజాశక్తి -సామర్లకోట

పదో తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్షకు శనివారం 40 మంది విద్యార్దులు గైర్హాజరైనట్లు ఎంఇఒ వై.శివరామ కృష్ణయ్య తెలిపారు. సామర్లకోట పట్టణ, మండలానికి సంబంధించి మూడు పరీక్షా కేంద్రాల్లో శనివారం జరిగిన హిందీ పరీక్షకు మొత్తం 50 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 10 మంది మాత్రమే విద్యార్దులు హాజరయ్యారు. 40 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ తెలిపారు.

వల్లభ స్వామికి రూ 3.35 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామంలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ 2,57,460, అన్నదాన విరాళాల ద్వారా రూ.69,805, కేశఖండన ద్వారా రూ.7,640 ఆదాయం, తులా భారం రూ.250 సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం, వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశామన్నారు. యాత్రికులకు ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందించారు.

29న పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ కె.పద్మావతి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఇంగ్లీష్, నీతి కథలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో శనివారం ఇంగ్లీషులో నీతి కథలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ వారు వాట్సాప్ ద్వారా పంపించిన 'కాకి అందం' ఇంగ్లీష్ భాష లోని నీతి కథను ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుతున్న బాలలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. పి.మనోహర్ స్పోకెన్ ఇంగ్లీష్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీతి పద్యాలు పాడడంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిబిరంలో సింగం బుల్లయ్య, కొమ్మన అప్పారావు, ఎల్.రాజు, బి.అరవింద్, ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడ బీచ్‌లో అలల ఉధృతి

శిథిల వంతెనలతో ఆందోళన


కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డులో రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. శనివారం ఉదయం నుంచి సముద్రపు అలలు తీవ్ర స్థాయిలో ఉండడంతో బీచ్ రోడ్డుకు గోడగా వేసిన రక్షణ రాళ్లు రోడ్డుపైకి చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలల ఉధతికి బీచ్ రోడ్డులో ఉన్న పాత వంతెన ఏ సమయాన కూలుతుందో అని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన వద్ద నుంచుని సాగర తీర అందాలను పర్యాటకులు వీక్షిస్తుంటారు. సుబ్బంపేట నుంచి ఎస్‌పిజిఎల్ శివారు వరకు అలలు బీచ్ రోడ్డు పైకి చేరుతున్నాయి. ఎస్‌పిజిఎల్ సమీపం వద్ద ఉన్న వంతెన పైనుండి కెరటాలు వెళ్లడంతో అటుగా వెళ్లే వాహనదారులు భయబ్రాంతులకు గురవుతున్నారు. వాయుగుండం తీవ్ర అల్పపీడనంగా మారుతుందన్న అధికారుల సమాచారంతో తీర ప్రాంత గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కోనపాపపేట, సూరాడపేట ఉప్పాడ గ్రామ మత్స్యకారులు కొంతమంది సముద్రానికి అతి దగ్గరలో ఉండి జీవిస్తున్నారు. వారిని అధికారులు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మత్స్యకార పెద్దలు కోరుతున్నారు. కోనపాపపేట నుండి కాకినాడ లైట్ హౌస్ వరకు సుమారు 6 వంతెనలు ఉన్నాయి. ప్రతి వంతెనకూ ఇరువైపులా గోడలు కూలిపోయి శిథిలావస్థకు చేరుకోవడంతో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో విజంభిస్తున్న అలలకు వంతెనలు ప్రమాదంలో ఉన్నాయని కనీసం అధికారులు వంతెనలను పట్టించుకున్న దాఖలాలు లేవంటున్నారు. వంతెలనలు ఎప్పుడు కూలిపోతాయో అని బిక్కుబిక్కుమని ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని వాహనదారులు తెలుపుతున్నారు. కనీసం వంతెనల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వచ్చేది వర్షాకాలం కాబట్టి మరెన్నో విపత్తులు వచ్చే సందర్భాలు ఉన్నాయి.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు

ప్రజాశక్తి కథనానికి స్పందన


మరమ్మతు పనులు

ప్రజాశక్తి-జగ్గంపేట

ఈ నెల 25న ప్రజాశక్తిలో ప్రచురించిన వథాగా పోతున్న తాగునీరు అనే శీర్షికకు ఆర్‌డబ్ల్యుఎస్ జెసి రామ్‌జీ స్పందించారు. సురక్షిత మంచినీరు సరఫరా చేసే పైపు లైన్‌కు శనివారం రిపేర్లు చేశారు. కాంట్రాక్టరుతో రిపేరు పనులు చేయించారు. పంపుల నుండి నీటిని విడుదల చేసినప్పుడు ఒక్కసారిగా వచ్చే నీటి వేగానికి గోవిందపురం వద్ద ఉన్న జాయింట్ పాడవుతోందన్నారు. శాశ్వత పరిష్కారం చేశామని గోవిందపురం గ్రామ ప్రజలకు నీటి ఇబ్బంది లేదని రామ్‌జీ తెలిపారు.

పైడాలో ఉత్సాహంగా ప్లేస్‌మెంట్ డే



ప్లేస్‌మెంట్ డేలో మాట్లాడుతున్న యండమూరి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పైడా గ్రూప్ విద్యాసంస్థల్లో ప్లేస్ మెంట్ డేను శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రముఖ నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ కంపెనీలలో నియామకాలు పొందిన డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 362 మంది విద్యార్థులు, వా తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో వీరేంద్రనాథ్ మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించిన తరువాత ఆ పనిలో నిపుణత ఎంత వేగంగా నేర్చుకుంటే అంత అభివృద్ధి సాధిస్తారన్నారు. జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యాలను పెట్టుకుని ముందుకు సాగాలని, అందరూ కష్టపడి చదవమని చెబుతారని, కాని ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు. జీవితంలో ఎంత ఉన్నతమైన ఉద్యోగంలో చేరినా తల్లిదండ్రులకు ఎప్పుడు మంచి కుమారుడు, కుమార్తెలుగా ఉండాలని సూచించారు. వీరేంద్రనాథ్‌ను పైడా విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీరామ్, నిత్య దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు కృష్ణమోహన్, డీన్ డాక్టర్ వీరభద్రరావు, డిడి రవీంద్ర రెడ్డి, ప్రిన్సిపల్స్ డాక్టర్ కేశవ్, సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అకడమిక్ డైరెక్టర్ వంశీకృష్ణరాజా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రూరల్‌లో జనసే పార్టీకి 20 వేల మెజార్టీ'

ప్రజాశక్తి కాకినాడ రూరల్

కాకినాడ రూరల్‌లో సుమారు 20 వేల పైన మెజారిటీతో తాను గెలుపొందబోతున్నానిజనసేన పార్టీ రూరల్ అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ధీమా వ్యక్తం చేశారు. స్థానిక గంగరాజు నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం మొత్తం పిఠాపురం, కాకినాడ రూరల్‌పై దృష్టి నిలిపిందన్నారు. ఓట్ల లెక్కింపులో దౌర్జన్యాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని ఎస్‌పి సతీష్ కుమార్ తెలిపారన్నారు. ఈ నేపథ్యంలో తమ కూటమి తరపున నాయకులు, కార్యకర్తలు పారదర్శకంగా ఉన్నామన్నారు. నాయకులు కార్యకర్తలు పూర్తి స్థాయిలో సంయమనం పాటించాలని సూచించారు. లెక్కింపు పూర్తయి డిక్లరేషన్ ఫారం తీసుకునే వరకు ఏజెంట్లు బయటకు రావద్దని సూచించారు. గెలిచిన తర్వాత విద్య వైద్యం, ప్రజలు స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి టీమ్ వర్క్ చేస్తామని అన్నారు. ఆర్భాటాలకు పోకుండా ప్రజలకు పనికొచ్చే పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు తాతాజీ, పుల్ల శ్రీరాములు, పాలిక రమణ, భోగిరెడ్డి గంగాధర్, కొండబాబు, బండారు మురళి, మాచవరపు సత్యనారాయణ, విత్తనాల రమణ, పాండ్రకి రాజు, విత్తనాల అప్పారావు, నున్న గణేష్ నాయుడు, సాదే ముసలయ్య, నందిపాటి త్రిమూర్తులు, తాటికాయల వీరబాబు, బత్తుల దొరబాబు కుడుపూడి బాలాజీ పుల్ల వీరబాబు, నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుని మృతిపై దర్యాప్తు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక యువకుడు అనుమానాస్పద మృతి పై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని. వెలిచేరు గ్రామానికి చెందిన కైరం నాగ శ్రీనివాస్(34) ఈనెల 22న ఇంటి నుండి సాయంత్రం బయటకు వెళ్లాడు. అయితే అతను ఈ నెల 23న ఉదయం వెలిచేరి వద్ద మధ్య డెల్టా కాలువ గట్టుపై విగతజీవిగా పడివున్నాడు. దీంతో అతనిని తండ్రి పోతురాజు స్థానిక పిఎంపి వద్దకు తీసుకువెళ్లగా పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించాడు. ఈ ఘటనపై తండ్రి పోతురాజు తన కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని ఎవరో కావాలని హత్య చేసి ఉంటారని పోలీసులు ఫిర్యాదు చేశాడు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి గా కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనివాస్ ఫోన్ నెంబర్ నుంచి ఎవరికి ఫోన్ చేశారు. శ్రీనివాస్ కి ఎంతమంది ఆరోజు ఫోన్ చేశారు. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఒంటిపై గాయాలు లేకపోవడం. షర్టు తడిసి ఉండడం. ముఖమంతా శుభ్రంగా ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై డాగ్ స్క్వాడ్ క్లూ టీమ్స్ కూడా వచ్చి పలు ఆధారాలను సేకరించినట్లు తెలుస్తుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పాటి చెరువుకి వెళ్లే ఆర్అండ్బి రోడ్డు సమీపంలో చోటు చేసుకున్న సంఘటనపై పోలీసు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తాళ్ల సతీష్ కుమార్ (36) ట్యూషన్ మాస్టర్ గా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు ఇంటి వద్ద మోటార్ సైకిల్ పై బయలుదేరాడు. అయితే గుడికి వెళ్లే మార్గం మధ్యలో మండలంలోని పాటి చెరువు సమీపంలోకి వచ్చేసరికి ఆర్ అండ్ బి రోడ్డుపై ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం సతీష్కుమార్ మోటార్సైకిల్ను ఢీకొంది. ఈ ఘటనలో అతనికి గాయాలు అయ్యాయి. వెంటనే అతనిని 108 లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నాన్న ప్రసాదరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు

సారా కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - గోపాలపురం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సారా బట్టీపై దాడులు నిర్వహించి వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించామని ఎస్ఐ కె.సతీష్కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వాదాలకుంట గ్రామం శివారు తాడిపూడి పంట కాలువ గట్టు వద్ద అదే గ్రామానికి చెందిన గుబ్బల శ్రీను సారాబట్టీని నిర్వహిస్తున్నాడన్నారు. ఈ మేరకు సిబ్బందితో దాడి చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రూ.20వేల విలువ గల 400 లీటర్ల బెల్లపు ఊట, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కొవ్వూరు కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్కు తరలించామని తెలిపారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట రామాలయంలో ఓ దుండగుడు శుక్రవారం అర్ధరాత్రి ఆలయ తలుపులు బద్దలు కొట్టి చోరీ చేస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. ఎవరూ లేని సమయంలో ఆలయ తలుపులు బద్దలు కొట్టి హుండీలో డబ్బులు దొంగతనం చేస్తుండగా పకడ్బందీగా పట్టుకున్నట్లు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తనను పోలీసులకు అప్పగించామన్నారు. వెంటనే స్పందించిన పోలీసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షాలతో ఊరట.. అభ్యర్థుల్లో అలజడి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గత నెల రోజులుగా భానుడి ప్రతాపానికి అల్లాడిన ప్రజలకు ఈ వారాంతంలో మారిన వాతావరణం కాస్తంత ఊరట నిచ్చింది. పల్లెలు, పట్టణాలలో సామాన్య ప్రజానీకంతోపాటు పాడి రైతులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. జీవాలకు ఊరట లభించిందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణి తుపానుగా మారడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఒక్క రోజు ముందుగానే వస్తున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిన విషయం విదితమే. తాజా వర్షాల నేపథ్యంలో కోనసీమ, కాకినాడ జిల్లాల్లో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. తూర్పు గోదావరి జిల్లాలో వరికోతలు ఈ నెల ప్రారంభంలోనే పూర్తవటంతో కొంత ఊరట లభించినట్లయింది. మిగిలిన రెండు జిల్లాల్లో కళ్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రభావంతో కొనుగోలు లక్ష్యం చేరుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. దీంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మద్దతు ధరకు తక్కువగా ధాన్యం విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతులకు అండగా నిలవాలని రైతులు, రైతు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇంకో వైపు వర్షాలు ముందుగానే రావటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవటంతో సాగు సందడిమొదలైంది.

ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధం



సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా కేంద్రాలలో చక చకా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కౌంటింగ్ సిబ్బందికీ ఇప్పటికే అవగాహన కల్పించడంతో గడువు తేదీ రావటమే తరువాయి. మరోవైపు అభ్యర్థుల్లో సామాన్య ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైసిపి, టిడిపి తరుపున పోటీ చేసిన అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు సుమారు రూ.50 కోట్లతో మొదలై రూ.100 కోట్ల వరకూ వెచ్చించారు. పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు ఇక సరేసరి. రూ.100 కోట్లకుపైగానే ఖర్చు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా జనసేనాని పవన్ కళ్యాణ్ పోటీ చేసిన పిఠాపురం నియోజకవర్గంలో అభ్యర్థుల ఖర్చు మరింత అదనమనే తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గెలుపు ఓటముల మధ్య అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఓటర్లలోనూ ఫలితాలపై జోరుగా చర్చ మొదలైంది. ఏ పార్టీ అధికారంలోకి రాబోతోందనే ఉత్సుకత వ్యక్తమవుతోంది. అయితే స్పష్టత రావాలంటే మరో 10 రోజులు ఆగాల్సిందే.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిక్కుళ్లు కేజీ రూ.100 మార్కు దాటేసింది. మిర్చి కేజీ రూ.80కు చేరాయి. వంకాయలు, బీర, ఇతర ఏ రకమైనా కేజీ రూ.60 వెచ్చించాల్సిందే. బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేక రైతు బజార్లకు వెళ్లిన కొనుగోలు దారులకు నిరాశే మిగులుతోంది. కూరగాయల నాణ్యత లేకపోవటంతో రైతు బజార్ల లక్ష్యం నీరు కారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతు బజార్లలో నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని కొనుగోలు దారులు కోరుతున్నారు.

అడ్మిషన్ల దందా షురూ

విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలలో అడ్మిషన్ల దందా మొదలైంది. ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా తూట్లు పడుతున్నాయి. ఎల్కెజి విద్యార్థికి కనీసంగా రూ.20,000 ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, బస్ఛార్జీల పేరుతో మరో రూ.10,000 యథేచ్ఛగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. పదో తరగతి చదివించాలంటే పాఠశాలల స్థాయిని బట్టి రూ.50,000 నుంచి రూ.1,00,000 వెచ్చించక తప్పడం లేదు. ఇంటర్మీడియెట్ కాలేజీ ఫీజులు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి. నీట్, టార్గెట్ ఐఐటి తదితర పేర్లతో రూ.1,00,000 నుంచి రూ.1.50,000 చొప్పన వసూళ్లు జరుగుతోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తీవ్ర ఉక్కబోతతో ఆక్వాకు కష్టాలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

నైరుతి పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, రెమాల్ తుపాను కారణంగా వాతావరణంలో తీవ్ర ఉక్కబోత వల్ల ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం కుండపోత వర్షం కురిసినప్పటికీ, శనివారం ఉదయం నుంచి వర్షం పడకుండా చిన్న చినుకు పడుతూ, గాలి స్తంభించి ఎండ రాకపోవడంతో రొయ్యల చెరువులకు ఆక్సిజన్ ప్రాబ్లం వచ్చి రొయ్యలు నీటిపై తేలుతూ ఈదడంవల్ల పలు చెరువుల్లో రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాళ్లరేవు మత్స్య శాఖ అధికారి గోపి మాట్లాడుతూ ఇటువంటి ఉక్క బోత సమయంలో చెరువుల్లో ఏరియేటర్స్ నిరంతరం పని చేయాలని సూచించారు. వాటర్ క్వాలిటీని పరీక్షించి పిహెచ్ (ఉదజని) శాతం 7.5 నుంచి 8.5 ఉండేలా చూసుకోవాలన్నారు. ఉదజని సూచికలో ఆమ్ల, క్షార స్థాయి ఏ విధంగా ఉన్నాయో చూసి దానికి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎండ లేకపోవడం వల్ల ఫొటోసింథసిస్ (కిరణ జన్య సంయోగ క్రియ) జరగకపోవడంతో చెరువులకు ఆక్సిజన్ ప్రాబ్లం వస్తుందని తెలిపారు. ఇటువంటి సమయంలో ఏరియేటర్స్ను కంటిన్యూగా తిప్పాలని అన్నారు. ఏరియేటర్స్ లేని రైతులు నీరు తోడే మోటారు, డీజిల్ ఇంజన్ సాయంతో చెరువులో నీటిని పంపింగ్ చేయాలన్నారు. ఆ సదుపాయం లేని రైతులు వాటర్ బోటు, లేదా మేత పెట్టే తెప్ప సాయంతో చెరువులో కొద్దిసేపు తిరిగినా ఆక్సిజన్ లెవెల్స్ పెరుగుతాయని తెలిపారు. కౌంటింగ్ దశకు వచ్చిన రొయ్యలను కొంతమేర వేటాడి తీసివేసిన, చెరువులో డెన్సిటీ తగ్గి మరునాడు డిఒ రాకుండా ఉంటుందని తెలిపారు. ఈ చర్యలు చేపట్టి ఉక్క బోత నుంచి రొయ్యల చెరువులను కాపాడుకోవచ్చని అన్నారు. వాతావరణం రెండు రోజులపాటు ఇలానే ఉంటే ఆక్సిజన్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.



ఆక్వా చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్స్

ఆధునిక విధానాలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పెద్దాపురం

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం డీన్ రమణమూర్తి తెలిపారు. వడ్లమూరులోని కమ్యూనిటీ భవనంలో శనివారం రైతులకు నిర్వహించిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పరికరాలను వినియోగించడంలో రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. పలువురు వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన అనేక అంశాలపై, నాణ్యమైన విత్తనాల ఎంపికపై, ఎరువుల సద్వినియోగంపై, చీడపీడల నివారణపై, అధిక దిగుబడులు సాధించడంపై అవగాహన కల్పిం చారు. ఈ సదస్సులో గ్రామ రైతుల తరపున కంటే వీరరాఘవరావు పలు సమస్యలను అధికారులకు నివేదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోదావరి జోన్ అసోసియేట్ డీన్ ఆఫ్ రీసెర్చ్ శ్రీనివాస్, దయాకర్, ఉషారాణి, సుధీర్, సీతారామ శర్మ, వడ్లమూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీవాణి ప్రసంగించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యాన రఘు సౌజన్యంతో శనివారం వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ పరులకు చేతనైనంత మేరకు సేవలు అందిస్తే అంతకంటే మహత్కార్యం ఏముంటుందని ప్రశ్నించారు. పరోపకార గుణంతో జీవిస్తేనే జీవితం సార్థకం అవుతుందని అన్నారు. ఆ దిశగా సంపాదనలో కొంత శాతాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్న రఘు పేదలకు నూతన వస్త్రాలు సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, రాఘవరావు, చంద్రరావు, కుమార రాజా తదితరులు పాల్గొన్నారు.



అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వస్త్రాల పంపిణీ



పిల్లలను గుర్తించిన అధికారులు

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి -కరప

కరప మండలం వేళంగిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ సర్వేను ఐఇఆర్పిలు నిర్వహించారు. శనివారం ఈ సర్వే అమలు తీరును పరిశీలించేందుకు సర్వ శిక్షాభియాన్ ఐఇ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, ఎంఇఒ పి.సత్యనారాయణ సర్వేలో పాల్గొన్నారు. ఐఇఆర్పిలు, కన్నె స్వాతి, నురుకుర్తి మల్లీశ్వరికి సూచనలు సలహాలు అందించారు. వేళంగి గ్రామంలో మచ్చ వివేక్, తేజ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్టు ఎంఇఒ సత్యనారాయణ తెలిపారు. మండలంలో 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను కరప మండల భవిత కేంద్రంలో తప్పనిసరిగా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పలుచోట్ల తడిచిన ధాన్యం

ప్రజాశక్తి-రామచంద్రపురం

అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు రైతులు దాచుకున్న ధాన్యం తడిసిపోయింది. వర్షాలు మరింతగా కురుస్తాయన్న సమాచారంతో రైతుల అప్రమత్తమయ్యారు. ధాన్యం రాశులపై పలు రైతులు బరకాలు కప్పుకోగా, ఎగుమతులు వేగం పెంచారు. దీంతో ట్రాక్టర్ల పై తర్పాలిన్ కవర్లు కప్పి ధాన్యం మిల్లులకు ఎగుమతులు వేగంగా జరుగుతున్నాయి. ఇక మొదట్లో 75 కేజీల బొండల ధాన్యానికి రూ.1400 చెల్లించగా ప్రస్తుతం రూ.1600 చేరుకుంది. ధాన్యం ధర పెరగడంతో రైతులు ధాన్యాన్ని ఎగుమతులు చేస్తున్నారు. మరోవైపు రోడ్ల వెంబడి పోగు చేసుకున్న ధాన్యాన్ని రైతులు బరకాలు, టార్పాలిన్లు కప్పి జాగ్రత్త చేసుకుంటున్నారు.



వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం

పెరిగిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వర్షాలు ప్రారంభమై రెండు రోజులు గడవక ముందే కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.30 నుంచి రూ.40 ఉండే పచ్చిమిర్చి ఒకేసారి కిలో రూ. 200 కు చేరింది. అదే బాటలో కొత్తిమీర మొన్నటి వరకు కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య ఉండగా ప్రస్తుతం కిలో 200 అమ్ముతున్నారు. దీంతోపాటుగా బీరకాయలు కిలో రూ.100కు చేరగా, వంకాయలు, బెండకాయలు కూడా కిలో రూ.60 నుంచి రూ.80 మధ్య ధర పలుకుతున్నాయి. ఒక్క ఉల్లిపాయలు టమాటాలు తప్ప మిగిలిన అన్ని సరుకులు ధరలు పెరిగాయి. అల్లం ధర కూడా సామాన్యులకు అందుబాటులో లేదు. వాటి వెంటే ఆకుకూరల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. బయట మార్కెట్ ధరలను అదుపు చేసే యంత్రాంగం ప్రభుత్వానికి లేకపోవడంతో ధరలు నియంత్రణ లేకుండా పోయింది రైతులు వద్ద తక్కువ ధరలకే కొంటున్న దళారులు అధిక మొత్తంలో లాభాలు వేసుకుని సామాన్యుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారు. సామాన్యులకు అందుబాటులో లేని ధరలు వీలైనంత వరకు తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెంకన్న ఆదాయం రూ.35 లక్షలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వివిధ సేవల ద్వారా శనివారం రూ.35 లక్షల వరకు ఆదాయం సమకూరిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వామివారికి వేకువ జామున సుప్రభాత సేవ, తొలి హారతి నిరాజనం మంత్రపుష్పం తదితర కార్యక్రమాల అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారన్నారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాన్ని కూడా అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారని వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి పర్యవేక్షించారు అలాగే శనివారం స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నదానం, విరాళాలు, లడ్డువిక్రయం, తదితర సేవలు వల్ల రూ.35 లక్షలు వరకు ఆదాయం సమకూరిందని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు జరగకుండా ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వచ్చిన యాత్రికులకు ప్రసాద వితరణ, భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు.

మందేశ్వరస్వామి ఆదాయం

రూ.2 లక్షల 27 వేలు


కొత్తపేట: మందేశ్వర స్వామి ఆలయములో స్వామివారికి తైలాభిషేకములు, పూజలు, ప్రసాద వితరణ ద్వారా రూ.2,02,770 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ మరియు ఇఒ కె.విజయలక్ష్మి శనివారం తెలిపారు మందేశ్వర స్వామికి తైలాభిషేకములు ద్వారా రూ.1,65,065, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.37,705 ఆదాయం వచ్చిందని తెలిపారు. సుమారు 400 మంది పైబడి స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించాలని తెలిపారు.



మరమ్మతు పనులతో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి- సామర్లకోట

మండలంలని అచ్చంపేట, ఉండూరు సమీపంలో కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన పైపులైన్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఎడిబి రోడ్డులో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అచ్చంపేట సమీపంలో కూలిన వంతెన వద్ద రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాటర్ పైప్లైన్ మరమ్మతులకు గురైంది. శుక్రవారం పైపులైన్ మరమ్మతు పనులను ప్రారంభించారు. శనివారం ఒకవైపు వర్షం పడుతుండగా మరోవైపు పైప్ లైన్ మరమ్మతులు చేస్తుండడంతో భారీ క్రేన్ల వల్ల ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సామర్లకోట నుంచి కాకినాడ పోర్ట్ వైపు కాకినాడ పోర్ట్ నుండి సామర్లకోట వైపు భారీగా లారీలు కార్లు నిలిచిపోయాయి. సామర్లకోట నుంచి శశికాంత్నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్కు వెళ్ళే ముడినీటి సరఫరా పైపులైన్కు లీకులు ఏర్పడ్డాయి. ఒకవైపు ఎడిబి రోడ్డు నాలుగులైన్ల రహదారి అభివృద్ధి పనులు మరోవైపు పైప్ లైన్ పనులతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



ఎడిబి రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

అచ్చంపేట వంతెన వద్ద పైప్లైన్ మరమ్మతులు





విద్యాకానుక స్టాక్ పాయింట్ను తనిఖీ చేస్తున్న అధికారులు

పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో పలు పాఠశాల్లో డిఇఒ పి.రమేష్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా విద్యా కానుకకు సంబంధించి మల్లేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ స్టాక్ పాయింట్ను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే ప్రతి ఒక్క విద్యార్థికీ విద్యా కానుక కిట్లు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ కెహెచ్.నాయక్ను సూచించారు. నాడు-నేడు పనులకు సంబంధించి జెడ్పి హైస్కూల్ హెచ్ఎం జి.సుధా మాధురి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల, విద్యా బోధన పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంఇఒ కెహెచ్.నాయక్, కె.వెంకటరెడ్డి ఉన్నారు.

కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సంబంధిత సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ముఖ్యంగా సిబ్బంది పూర్తిగా అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఇవిఎం లెక్కింపు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా సెల్ఫోన్లు అనుమతించబోరని తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు, కౌంటింగ్ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధి కారులు బి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో థైరాయిడ్ సమస్య

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

థైరాయిడ్ మెడ మందు భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఏర్పడుతుందని, అయోడిన్ లోపం థైరాయిడ్ సమస్యకు ప్రధాన కారణమని డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ థైరాయిడ్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. థైరాయిడ్ సమస్య వల్ల బరువు పెరగడం లేదా తగ్గడం, నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం, ఉద్వేగం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కనబడతాయని అన్నారు. పెద్దవారిలో జీవ క్రియలను థైరాయిడ్ హార్మోన్లు నియంత్రిస్తాయని అన్నారు. ఇలా అన్ని దశలలో థైరాయిడ్ చాలా కీలకమని అన్నారు. అయోడిన్ కలిగిన ఉప్పును ఉపయోగించాలని, నూనె పదార్థాలను పరిమితంగా తీసుకోవాలని, తప్పనిసరిగా వ్యాయామం చేయాలని డాక్టర్ సువర్ణ రాజు తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సిహెచ్. వెంకట్రావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

3 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

శివల గ్రామం లో శనివారం 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఇక్కడ గల శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు గ్రామస్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. శివల, గుడిగల్ల తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమం లో ఇళ్ళ సూర్య నారాయణ, వీరబ్రహ్మం తదితరప్రముఖులు పాల్గొన్నారు.